# మూక వాణి

"ఏమిటి అట్లా కూర్చున్నావు చెప్పమంటే చెప్పవు." ఆరిందాలా గద మాయించాడు ధర్మారావు.

తులసి యేమీ మాట్లాడలేదు.

'వూరికే దిగులుపెట్టుకుని కూర్చుంటే యేం లాభం ....'

దీనికి సమాధానంలేదు.

"సహవాసదోషం. అడ్డమైనవాళ్ళతోను స్నేహితాలే. మంచి అబ్బటం కష్టంకాని వీటికేం భాగ్యం...."

'ఏమంత చెడ్డపని చేశాడని! తెల్లారిలేస్తే మీరుపెట్టే ఖర్చుల్లో వుపయోగించే వేమిటో వేళ్లతో లెక్కపెట్టి చెప్పండి. ముష్టి నాలుగు రూపాయలకు యింత రభస కావాలా! ఎక్కడైనా పిల్లలు వున్నారు. తండ్రులూ వున్నారు. కాని యింత వుప్పద పెట్టటం మన కొంపలోనే కాని యింకెక్కడా చూడలా! మనవాన్ని బైట పెట్టాలా! మనం బైట పడాలా! అబ్బ! ఎట్లాగైతే యీ భూమిమీద ధర్మం నిలబెట్టారు....' తులసి బడబడ అనేసింది.

'అయితే సహించి వూరుకుని కూర్చోమంటావా.'

'అబ్బ! అంత సహించరాని పనులు యేం చేశాడనో!'

'ఇప్పుడు వాడుచేసినవన్నీ సహించతగ్గవే అంటావు. అంతేనా నువ్వనేది! నేనూ తెల్లారిలేస్తే నలుగుర్లో తలెత్తుకుని తిరగాల్సినవాడిని.'

'అవును. అవును యిప్పుడు బాగా తిరుగుతున్నారుగా తలెత్తుకుని!' యెంతో ఉక్రోషంతో అన్నది తులసి.

'అసలు నీ మూలానకదూ యీ తతంగంఅంతా జరిగింది.'

'అవున్లెండి అన్నీ నా మూలానే జరిగినాయి. వాణ్ణేమో అక్కడికి యిక్కడికీ వెళ్లి యెత్తుకు రమ్మన్నాను. మిమ్మల్నేమో పళ్ళాపై తెలీకుండా చాప బాదమన్నాను. ఇప్పుడు నా కళ్లు చల్లగా వున్నాయి. అన్నీ నేనే చేసింది....' తులసి పొర్లుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

ధర్మారావు కూడా ఆ క్షణంలో తొణికిసలాడాడు.

'వాణ్ణి కొట్టకండి, పసివాడు, కొస్త యీడొస్తే వాడికే తెలుస్తుంది. మనవాన్ని మనం మన్నించకపోతే వూళ్లోవాళ్లు మన్నిస్తారా అని యెన్ని విధాల చెప్పాను. మీరేమన్నా నా మాట విన్నారా! గొడ్డును బాదినట్లు బాదారు. మీకు చేతులెట్లా వచ్చినాయె! నా కడుపు చీల్చుకుని నా వళ్లోకి వచ్చాడు నా చిట్టి తండ్రి! వాన్ని పల్లెత్తుమాట యెవరన్నా అంటే నా కడుపు తరుక్కుపోతుంది. వాడికి కాల్లో ముల్లు గుచ్చుకుంటే నా ప్రాణాలు అవిసిపోతాయి. వాడికి తలనొప్పి వచ్చిందంటే నా ప్రాణం హడలిపోతుంది. వాన్ని ఒక్క క్షణం చూడకపోతే నా మనస్సు తహతహలాడిపోతుంది. నా కడుపులో చిచ్చుపెట్టారు. వాన్ని అదరకొట్టి తరిమేశారు.' తులసి హోరుమని యేడ్చింది.

తులసి గతాన్ని తలుచుకుంటూ దుఃఖాన్ని దిగమింగుకుంటోంది. 'అబ్బ! తండ్రంటే యెంత భయం! దగ్గరకు వెళ్లాలంటే ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని చాటునా మాటునా నక్కుతూ వెళ్లేవాడు. వాడికి తాను చేసిన పని తప్పనీ తెలుసు. ఇంకోళ్లు చూస్తే యేమనుకునిపోతారో అనే బిడియమూ వుంది. అభిమానమూ వుంది. ఎక్కడికి వెళ్లాడో యేంచేస్తున్నాడో! రోజూ యీ పాటికి అమ్మా ఆకలి అవుతోంది తొంద రగా అన్నం పెట్టవే అంటూ వచ్చేవాడు. చిట్టితండ్రి ఇప్పుడు యెక్క డున్నాడో' తులసి గజిబిజిగా లేచింది.

ఒక్కొక్కరోజు గడుస్తున్నకొద్దీ తులసికి వియోగబాధ యెక్కు వైపోతోంది. ఏ పనీ చెయ్యడానికి మనస్సు ఒప్పటంలేదు. కాళ్లు చచ్చుపడి పోతున్నాయి. మనస్సు తీవ్రంగా ఆందోళనపడి పోతోంది. తులసి నిద్రహారాలులేక చిక్కి శల్యమై పోతోంది.

"నువ్వు ఏమయిపోతావో అని పేపర్లలో వేయించాను. ఇంత వరకు జాడ తెలియదు. నీ బాధ చూస్తుంటే మహాదారుణంగా వుంది. నువ్వు ఒక్కడైవే కన్నావా పిల్లాన్ని! తిరిగి తిరిగి వాడే వస్తాడు. ఇదొక గాలి, ఈ మాత్రానికి నువ్వింత దిగులుపడితే ప్రయోజనం! వాడికింకా బుద్ధిరావాలి. ఎంత డబ్బుంటే యేం! అనుభవించే యోగ్యత వుండద్దూ. కడుపు మాడ్చుకుని కుక్కలాగ ఆ పంచన యీ పంచన తిరుగుతూ వుంటాడు....' ధర్మారావు అక్కనంతా వెళ్లబుచ్చాడు.

'మీకు పుణ్యం వుంటుంది. అబ్బాయిని యేమనకండి....' గద్గ దంగా తులసి మాట తడబడింది. కాస్త ఫెళ్లున కాస్తే, ఆనాడల్లా తులసి హృదయం రెప రెప కొట్టుకుపోతుంది. జోరున వర్షం కురిస్తే ఏక ధాటిగా ఏడుస్తూనే వుంటుంది.

ఒకనాడు వున్నట్టుండి అబ్బాయి యింకా యింటికి రాలేదేమా అని చిరాకుపడ్డాడు ధర్మారావు.

'చేసిన బుద్ధి తక్కువ పనికి తండ్రి దండించాడు అనే జ్ఞానం కూడా లేకపోయింది. వాడికి యెప్పుడు తెలిసి వస్తుందంట! నేను ఆకాశం మీదనుంచి వూడిపడ్డానా యేమిటి! నేను మాత్రం తండ్రిని కదూ....' అని రుసరుసలాడాడు.

అట్లా చూస్తూ చూస్తూండగానే ధర్మారావు యేమిటో చిక్కిపోయి నట్లు తులసికి చప్పున అనిపించింది.

ఎంతసేపు ఆపుకున్నా ఆపుకోలేకపోయింది. ఒకనాడు గట్టిగా భర్తను అడిగేసింది, మీరు అన్నం కూడా సరిగ్గా తినటంలేదు. అట్లా వుంటున్నారేం అని.

ధర్మారావు చప్పున తలెత్తి, తులసి కళ్లల్లోకి చూశాడు.

ఒంట్లో సరిగ్గా వుండటంలేదులే అన్నాడు.

మనిషి సగం అయ్యాడు. శరీరంలో జబ్బేమీ లేదంటాడు డాక్టరు. అట్టే యిట్టే బజారుకు బయలుదేరేవాడు. అవసరమైన పనుంటే కాని యిల్లు కదలటంలేదు. తన గదిలో ప్రొద్దస్తమానం ముసుగు పెట్టుకుని పడుకుని వుంటాడు.

తులసికి యెటూ తోచటంలేదు. మొన్న మొన్నటిదాక అన్నం సరిగ్గా తినక, వేళకు నిద్రపోక శరీరాన్ని అదుపులోంచి తప్పించుకుంటూ వచ్చింది. నిస్సత్తువుగా లేస్తుంది. నీరసంగా పనులు చేస్తుంది. తనకు వీలైనప్పుడు యింత వుడకేసి పడేస్తుంది. తిన్ననాడు తింటుంది, లేని

నాడు అదీలేదు. ఇప్పుడు అట్లా సాగేటట్లు లేదు. భర్తేమో మంచం మీద పడుకున్నాడు. ఆయనకు మందులివ్వాలి, వేళాపాళా లేకుండా వేన్నీళ్ళు, చన్నీళ్ళు అందిచాలి. వీటన్నింటికి తనకు వోపికేది! నా కోసం కాకపోయినా, యీ చాకిరీ చెయ్యటానికైనా యింత తినకపోతే యెట్లాగు అనుకుంది. పట్టు బలవంతాన నాలుగు మెతుకులు లోపలికి పోనిస్తోంది.

డాక్టర్ని తన భర్త విషయమై పదే పదే అడిగింది. జబ్బు లేకపోతే యీ వరసన మంచాన పడివుండటమేమిటి చెప్పండి అంటూ రెట్టించి అడిగింది తులసి.

డాక్టరు యెటూ చెప్పలేకపోయాడు.

అప్పుడే సూర్యుడు క్రిందకు దిగిపోయాడు. సంధ్య చీకటిగా వుంది. ఎటూగాని వేళ ఏ పని చెయ్యకూడదన్నట్టు, తులసి దొడ్లో తులసి గట్టుమీద కూర్చుని వెర్రిగా ఆలోచించుకుంటోంది. మెల్ల మెల్లగా చల్లటి కిరణాలు మృదువుగా సన్నజాజి తీగమీద ప్రాకుతూ పోతున్నాయి. అటువైపుకే చూస్తూ కూర్చున్నది. తన ఆలోచనా తరంగాలు చిరుగాలికి అటూ యిటూ గంతులు వేస్తున్నాయి. ఎదురుగుండా పెద్ద బాదంచెట్టు నడుం విరిగి క్రింద పడిపోయివుంది. శాయి ఆ బాదంచెట్టు పండే ఒకటి తీసి పాతిపెట్టాడు. మొక్క పైకి వచ్చింది. తులసి నిత్యమూ దానికి నీళ్ళుపోస్తూ వుంటుంది. ఏ ఒక్కరోజు ఆ ఆ మొక్క వాడు మొహంగా వున్నా, తులసి మనస్సు చివుక్కమంటుంది.

ఆ బాదం మొక్క అక్కడెందుకు పీకి పారేస్తా అని ధర్మారావు దురుసుగా ఒకనాడు అంటే, తులసి అడ్డమొచ్చి, వాదించి నిలబెట్టుకుంది.

ఆ మొక్క మారాకువేసింది. కొంచెం పొడుగు పారింది. రెండు మూడు వైపులా చిన్న కాడలూ వచ్చినాయి. ఆ లేత ఆకులమీద వెన్నెల కిరణాలు మెరుస్తుంటే. తులసికి బ్రహ్మానందంగా వుంది. దాని వైపుకే అట్టే చూస్తూంటే, శాయి భవిష్యత్తులోకి చూస్తున్నట్లనిపించింది.

చటుక్కున తాటాకు చప్పుడయింది. అలాగా చూస్తోంది. ఇంకోసారి చూస్తోంది. తులసి అనుమానంగా లేచింది. సన్నగా అమ్మా అమ్మా అని మాటలు వినిపించినాయి. తులసి ఒక్క అంగలో అక్కడికి వెళ్ళింది. గజ గజ వణికిపోయింది. పెదిమలు పెగిలిరాలేదు. కళ్ళు తడిసి ముద్దలయినాయి. అమాంతం శాయిని కావలించుకుంది. ఆ క్షణంలో తులసికి యేం మాట్లాడాలో యేం చెయ్యాలో తోచటంలేదు.

'శాయి, నేను చచ్చి పోయినాననుకున్నావా! నన్ను యెంత బాధ పెట్టావురా! మళ్ళా యీ కళ్లతో నిన్ను చూడగలననుకున్నానా!' శాయిని చుట్టేసుకుంది.

చప్పున తల్లి నోరుమూసి, నేను వచ్చినట్టు నాన్నకు చెప్పొద్దన్నాడు. వెళ్ళిపోతానన్నాడు. మళ్లా కంటికి కనిపించనన్నాడు. తండ్రికి జ్వరం వస్తోందని చెపుదామనుకుంది. నాన్నంటే చప్పున మండి పడుతున్నాడు. ఎంత చెప్పినా, శాయి తన పట్టు విడవటంలేదు.

'నేను నాన్నను చూడను. నేను వచ్చినట్లు నాన్నకు తెలియకూడదు. నేను వచ్చినట్టు నువ్వు కనక చెప్పావంటే, మళ్లా నీ కంటికి కూడా కనపడను' శాయి ఆవేశంగా అన్నాడు.

తులసి యేమీ మాట్లాడలేకపోయింది. ఆ రాత్రికి రాత్రే శాయి వెళ్లి పోయాడు: మళ్ళీ యిట్లాగే కనిపిస్తానంటూ. ఆ రాత్రల్లా తులసి కంటిమీద కునుకులేదు. ధర్మారావు బరువుగా మంచంమీద అట్లాగే

పడున్నాడు. కొడుకుమాట భర్తతో ఎట్లాగా చెప్పటమా అని మథనపడి పోతోంది.

ధర్మారావును చూడటానికి యిద్దరు ముగ్గురు డాక్టర్లు మారారు. ఇరుగు పొరుగువాళ్లు తలొక మాట అంటున్నారు. మీ అబ్బాయి లేచి పోయి నప్పటినుంచి మీకు శని చుట్టుకుందండీ అని కొందరు అంటు న్నారు. రోజు రోజుకు నీరసించి పోతున్నాడు. ఏ మందు పని చెయ్యా టంలేదు. తులసికి ఎటూ లోచటం లేదు. మనోబాధ యెక్కువయి పోతోంది. భర్త స్థితి చూస్తుంటే తన మనస్సు మంచిగా ఆలోచించే స్థితిలోంచి తప్పిపోతోంది.

ఆ రాత్రి మళ్ళీ శాయి వచ్చినప్పుడు బుజ్జగించి బ్రతిమాలి చెప్పింది. ఎన్ని చెప్పినా అన్నింటికి వికటంగానే సమాధాలు చెప్పాడు.

తులసికి చెడ్డకోపం, ఉక్రోషం వచ్చినాయి.

"నన్ను యీ విధంగా బాధపెట్టి చంపేస్తావట్రా! నేను నీకు తల్లినికాదూ! నేను చెప్పిన మాట వినవూ" అంటూ గద్దించింది కూడా 'నువ్వు కనక నాన్నకు నా విషయము చెబితే నామీద వట్టే' అన్నాడు శాయి కోపంగా.

తులసి గట్టిగా రెండు చెవులు మూసుకుంది. తులసి పూర్తిగా క్రుంగిపోయింది. భర్త మంచం దగ్గర కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'ఎందుకు ఏడుస్తావు.....ఇదంతా కర్మ. అనుభవించక తప్పదు...' ఆయాసపడ్డాడు ధర్మారావు.

తులసి చప్పున మంచినీళ్లు అందిచ్చింది.

'అబ్బాయి యిన్నాళ్లకు కూడా.... ....రాకుండా వుంటాడని అనుకో లేదు, అన్నాడు ఆయాసం ఆపుకుంటూ ధర్మారావు.

తులసి దుఃఖం ఆపుకోలేకపోయింది. బావురుమని పెద్ద పెట్టున ఏడ్చింది.

'నేను పాపిష్టిదాన్ని. ఎంతో ఘోరమైన పాపం చెయ్యకపోతే యీనాడు నేను ఈ స్థితిలో ఉండను. నన్ను చిత్రవధ చేసినా పాపం లేదు. నా నోరు పడిపోయింది. నా నోరు నొక్కేశాడు....' తులసి కన్నీరు మున్నీరుగా ఏడుస్తోంది.

చప్పున ఏటో తప్పుతోచింది. గబగబ కళ్లు అద్దుకుంది.

'ఇందులో నీ తప్పేముంది. ధర్మారావు మెల్లిగా లేవబోయి మంచంమీదికే వరిగాడు.

'నేను నీ మొహం చూడలేను....' అనుకుంటూ రెండు చేతుల్తో గట్టిగా మొహాన్ని కప్పుకుంది.

వస్తున్న డాక్టర్ని మధ్యలో ఆపి ఆదుర్దాగా తన భర్త విషయం అడిగింది.

'ధర్మారావుగారికి సుస్తేమీలేదు. మనోవ్యాధి.... మీ అబ్బాయి జాడేమన్నా తెలిసిందా? డాక్టరు చెపుతున్నమాటలు పూర్తిగా వినిపించు కోకుండా తులసి అమాంతం విరుచుకుపడిపోయింది. స్పృహ లేదు.

తులసీ.... తులసీ.... సన్నగా మాటలు వినిపించినాయి.

ధర్మారావు మంచంలోంచి లేవబోతున్నట్లు కనిపించాడు. ధర్మారావు ఆవేదనగా, ఆదుర్దాగా భార్య కళ్లల్లోకి చూస్తున్నాడు.

'శాయి వచ్చాడా.... శాయి....శాయి....అదుగో వస్తున్నాడు. ఏమేవ్....నిన్నే....వాడొచ్చాడు........' ధర్మారావు వెర్రిగా అరిచాడు.

తులసి అమాంతం లేచి నిలబడింది. విశ్చలంగా భర్త వైపుకే చూస్తోంది.

డాక్టరు వీళ్లిద్దరి పరిస్థితి చూసి గాభరాపడి పోయాడు. తులసి ఆదుర్దాగా దొడ్లోకి, సావిట్లోకి వస్తూ పోతోంది. ఎక్కడ కాస్తంత చప్పుడయినా శాయి వస్తున్నాడని భ్రమపడుతోంది. శాయి రాంగానే అమాంతంగా వాన్ని తండ్రి దగ్గరకు తీసుకుపోవాలని అనుకుంటోంది. ఒళ్లంతా కంపించి పోతోంది. ఉక్కిరి బిక్కిరి అయిపోతోంది. భర్త పెదిమలు కదులుతున్నాయన్న మాటే గాని, మాటలు పైకి వినిపించటం లేదు. తులసి హృదయం దహించుకు పోతోంది. వచ్చేవేళ అయిందని తులసి చప్పున దొడ్లోకి వెళ్లింది. శాయి అదివరకు వచ్చిన వైపుకే చూస్తోంది. కళ్లు చిల్లులు పొడుచుకుని చూస్తుంటే డాక్టరు చప్పున పిలిచాడు లోపలికి రమ్మని. తులసి వళ్లు జల్లుమన్నది. గుండె దడదడ కొట్టుకుంటోంది. చైతన్య రహితంగా అట్లాగే నిలబడిపోయింది. నోట మాటలేదు. చుట్టుప్రక్కలవాళ్లు నలుగురు మెల్లిగా లోపలికి వస్తున్నారు. ధర్మారావు మంచంచుట్టూ చేరారు. తులసి కళ్లార్పకుండా చూస్తూ అట్లాగే చతికిలపడింది.

ఒక్కక్షణం వాతావరణం అంతా నిశ్శబ్దంగా వుంది. నిశ్శబ్దాన్ని చీల్చుకుని, శాయి అమాంతం వచ్చి తల్లివడిలో పడ్డాడు అమ్మా అమ్మా అంటూ.

'మన అబ్బాయి వచ్చాడు మన అబ్బాయి వచ్చాడు....' అంటూ తులసి గుండెల్ని బాదుకుంటూ హోరు హోరున ఏడ్చింది.

( ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25—2—1959 )